క్లుప్తంగా

వైభవంగా రంగనాథస్వామి ఆలయ వార్షికోత్సవం


రంగనాథస్వామి

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలో రంగనాథస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తుల కోసం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పాదుకా పూజ


స్వామి చిత్రపటానికి పాదపూజ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిం దత్త నాథ క్షేత్రంలో హస్త నక్షత్రం సందర్భంగా గణపతి సచ్చిదానంద స్వామీజీ సద్గురు పాదుకా పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు సింహాచల శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం, దత్త ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి


పత్రాలను అందిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్, సిబ్బంది

జి.సిగడాం: ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి స్వీకరించిన పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు అధికారులు పరిష్కార మార్గాలు చూపుతున్నారు. అయితే అర్జీదారుల్లో చాలామంది ఫోన్లు లిఫ్ట్ చేయకపోవడంతో అధికారులు వారి ఇళ్లకే వెళ్లి పత్రాలు అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సెలవు రోజైనప్పటికీ తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీఓ జి.కృష్ణారావు, ఏఎస్ఐ రామకృష్ణ, వీఆర్‌ఓలు భూపతి నర్సింగరావు రాజాం మండల పరిధిలోని అర్జీదారుడి ఇంటికి వెళ్లి సమస్య పరిష్కరించారు. కొన్ని ఫిర్యాదులు కోర్టు పరిధిలో ఉండటంతో సమస్యలు పరిష్కారంలో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

చిన్నారులకు భగవద్గీత తరగతులు


భగవద్గీత పారాయణ చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్ : చిన్మయ మిషన్ నిర్వాహకులు పరాత్మానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో బలగలోని హరే రామ మందిరంలో ఆదివారం చిన్నారులకు భగవద్గీత తరగతులు నిర్వహించారు. చిన్నారులతో శ్లోక పారాయణలు చేయించారు. ప్రతి ఆదివారం బాల విహార్ పేరిట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, ఎవరైనా తమ పిల్లలను ఇక్కడికి పంపించవచ్చని, పూర్తి వివరాలకు 9440546282, 7893931624 నంబర్లను సంప్రదించాలని చిన్మయా మిషన్ ప్రతినిధి కూనపులి వెంకటేశ్వర్లు కోరారు.

రణస్థలంలో వైద్య శిబిరం

రణస్థలం: రణస్థలం గ్రామంలో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యపరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మజ్జి రమేష్, హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సముద్రతీరం పరిశీలన


తీర ప్రాంతాన్ని సందర్శిస్తున్న మానవ హక్కుల కమిటీ సభ్యులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పెదగనగల్లవానిపేట సముద్ర తీర ప్రాంతాన్ని మానవ హక్కుల వేదిక కమిటీ సభ్యులు ఆదివారం సందర్శించారు. పర్యాటకానికి కోత శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించి తీర ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. నాగావళి నది- సముద్రతీరం కలిసే చోటను పరిశీలించి రక్షణ గోడ కట్టే దిశగా చర్యలు తీసుకోవాలన్న విషయమై ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా ఇన్‌చార్జి ఫల్గుణరాజు, రాష్ట్ర ఇన్‌చార్జి కె.వి.జగన్నాథం పాల్గొన్నారు.

ఎందుకో.. ఏమో..!

- అంబేడ్కర్ వర్సిటీ పాలక మండలి సమావేశం నిర్వహణలో జాప్యం
- కూటమి ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు గడుస్తున్నా నిర్వహించని వైనం
- పాలక మండలి అనుమతి లేకుండానే ఆర్థిక పరమైన నిర్ణయాలు
- వర్సిటీ ప్రగతిపై తీవ్ర ప్రభావం


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఎచ్చెర్ల క్యాంపస్: విశ్వవిద్యాలయం ప్రగతిలో పాలక మండలి పాత్ర ఎంతో కీలకం. ప్రతి మూడు నెలలకోసారి సమావేశ నిర్వహించాలి. అదీ సాధ్యం కాకపోతే ఆరు నెలలకోసారైనా సమావేశమై భవిష్యత్ కార్యాచరణ, వర్సిటీ ప్రగతిపై చర్చించాలి. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుని వాటి అమలుకు ర్యాటిఫికేషన్ చేయాలి. ఇలా వర్సిటీని ముందుకు నడిపించాలి. ప్రస్తుతం ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మాత్రం తొమ్మిది నెలలుగా పాలక మండలి సమావేశం నిర్వహించలేదు. దీంతో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చివరి క్షణాల్లో రద్దు..

పాలక మండలిలో ఉన్నతాధికారుల భాగస్వామ్యం ఉంటుంది. 12 మంది వరకు పాలక మండలిలో సభ్యులుగా ఉంటారు. ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యా మండలి, ఆర్థిక శాఖ, వర్సిటీ అధికారులు, నామినేటెడ్ ప్రతినిధులు ఉంటారు. వీరందరూ చర్చించి సమష్టి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. వర్సిటీ అధికారులు పాలక మండలి సమావేశం కోసం అనేక సార్లు ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 9న సమావేశం నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే చివరి క్షణంలో సమావేశం రద్దు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిక రాష్ట్రంలో 17 మంది వీసీలు రాజీనామా చేశారు. ఇక్కడి వర్సిటీ వీసీకి సైతం డెడ్‌లైన్లు, రాజీనామా ఒత్తిళ్లు వచ్చినట్లు సమాచారం. అయినా ఇక్కడి అధికారులు రాజీనామా చేయలేదు. మరోవైపు వర్సిటీ అధికారులు కూటమి నాయకులు, ఉన్నతాధికారులు చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా పాలక మండలి సమావేశానికి అనుమతి రావడం లేదు.

అనుమతులు లేకుండానే నిర్ణయాలు..

ప్రస్తుతం అనుమతులు లేకుండానే కొన్ని ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. వీటిని పాలక మండలి వ్యతిరేకిస్తే సమస్యలు వస్తాయి. మరోవైపు భవిష్యత్తులో ఆడిట్ అభ్యంతరాలు సైతం వెంటాడుతాయి.

- ప్రస్తుతం ఏడాదికి నియమించిన రిజిస్ట్రార్ పదవీ కాలం పూర్తయ్యింది. ఈ పదవిలో కూడా పాలక మండలి అనుమతి లేకుండానే నియమించారు. రిజిస్ట్రార్ కొనసాగింపు, తొలగింపు వంటివి ఈసీలో పెట్టి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.
- వర్సిటీలో పనిచేస్తున్న 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను గత ఏడాది డిసెంబర్ 31న తొలగించారు. ఇది పాలక మండలి అనుమతి లేకుండా అధికారులు నిర్ణయం తీసుకున్నారు.
- సీనియర్ ప్రొఫెసర్, ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు పదోన్నతి కోసం కెరీర్ అడ్వాన్స్ స్కీం (సీఏఎస్) ఇంటర్వ్యూ బోర్డు ఈసీ అనుమతి లేకుండానే నియమించారు. ఉన్నతాధికారులు ఈ కమిటీ ఇంటర్వ్యూలు అడ్డుకున్నారు.
- ఎటువంటి నోఫికేషన్ లేకుండా, ఈసీ అనుమతి లేకుండా రూ.లక్ష వేతనానికి ప్రత్యేక అధికారి, మరి కొన్ని నియామకాలు చేపట్టారు.
- ఈసీ అనుమతి లేకుండానే వర్సిటీలో ఒక ఉన్నత అధికారి కుటుంబ వ్యక్తిగత అవసరాల కోసం రూ. 6 లక్షలు కారు కొనుగోలు చేశారు.

ఆర్థిక సంవత్సరంలో నిర్వహించపోకతే..

మార్చి 31లోపు కచ్చితంగా బడ్జెట్ పాలక మండలి సమావేశం నిర్వహించాలి. లేదంటే బడ్జెట్ కేటాయింపులు రావు. గత నవంబర్ నుంచి ప్రభుత్వం నుంచి బడ్జెట్ రాకున్నా, వర్సిటీ అంతర్గత నిధులు నుంచి ఖర్చు చేస్తున్నారు. పాలక మండలి సమావేశం నిర్వహించకపోతే ఈ నిధులు ఖర్చు సైతం సాధ్యం కాకపోవచ్చు. అంతర్గత నిధుల నుంచి వర్సిటీ నిర్వహణ దీర్ఘకాలం సాధ్యం కాదు.

ముగిసిన జిల్లాస్థాయి పెన్‌కాక్ సిలాట్ పోటీలు


పతకాలు సాధించిన క్రీడాకారులతో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి పెన్‌కాక్ సిలాట్ మార్షల్ ఆర్ట్స్ పోటీలు ముగిశాయి. ఆదివారం వాడాడలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో 6వ జిల్లాస్థాయి పెన్‌కాక్ సిలాట్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు పతకాలు, ప్రసంశాపత్రాలు అందజేశారు. ఇక్కడ విజేతలగా నిలిచిన క్రీడాకారులు జూలైలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని పెన్‌కాక్ సిలాట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సక్క లక్ష్మణ్‌నాయుడు పేర్కొన్నారు. అనంతరం విజేతలకు స్కూల్ డైరెక్టర్ ముద్దాడ సత్యప్రసాద్, పెన్‌కాక్ సిలాట్ జిల్లా అధ్యక్షులు రేగిడి దయామయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్స్ లింగాల ఈశ్వరరావు, హేమంత్ కుమార్, హరీష్, చంద్రశేఖర్, సాయికిరణ్, అంపోలు ఈశ్వర్, రిఫరీలు దుర్గ దాస్ ప్రశాంత్ సంతోష్, మామిడి పవన్ సాయి, సూచిరిత, నాగేశ్వరి, రోహిత్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలో శ్రీ పరశురామ యుద్ధ కళాక్షేత్రానికి చెందిన విద్యార్థులు ఫెన్‌కాక్ సిలాట్ పోటీల్లో ప్రతిభ కనబర్చారని కరాటే ట్రైనర్ లింగాల ఈశ్వరరావు తెలిపారు. 25 స్వర్ణాలు, రెండు రజత పతకాలు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆదివారం అభినందించారు.

రామాయణ స్త్రీలు వివేకవంతులు


పద్మనాభాచార్యులును సత్కరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: రామాయణంలో స్త్రీలు ఎంతో విశిష్టత కలిగిన వ్యక్తులని భాష్యం పద్మనాభాచార్యులు అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో 'రామాయణంలో వివేకవంతమైన స్త్రీలు' అనే అంశంపై ఆదివారం ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. సీత, సుమిత్ర, తార, మండోదరిలు ఎంతో వివేకంతో ప్రవర్తించారని కొన్ని ఉదాహరణలతో వివరించారు. అనంతరం వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పి.పతంజలి శాస్త్రి, కోమలరావు, విశ్వేశ్వరరావు, పెద్ది ఈశ్వరరావు, వై.రమణారావు, కె.బాబూరావు, సరస్వతి పాల్గొన్నారు.

శభాష్ సుధీర్


సుధీర్‌ను సన్మానిస్తున్న పెంట గ్రామస్తులు

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో మొదటి ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్‌గా పట్టా పొందిన మీసాల సుధీర్‌ను ఆదివారం గ్రామస్తులు, నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంతకవిటి మాజీ ఎంపీపీ కొల్ల అప్పలనాయుడు, గ్రామ సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ సభ్యురాలు మక్క శ్రీలత, రాజాంపట్నంకు చెందిన వైద్యులు హరిబాబు, గార రవిప్రసాద్, మక్క నారాయణరావు, ప్రధానోపాధ్యాయులు మజ్జి మదన్‌మోహన్, ఉగ్రంకల రామారావు, పున్నాన అక్కలనాయుడు, శ్రీనివాసరావు, విశ్రాంత ఉద్యోగులు మక్క పెద్ద అప్పలనాయుడు, మక్క శ్రీరాములు, ఉద్యోగ సంఘం నాయకులు మక్క సురేష్, బొత్స వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పాదాలమ్మ తల్లి ఉత్సవాలు


ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


శివశ్రీ నృత్యనికేతన్ విద్యార్థుల ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: బాకర్‌సాహెబ్‌పేట గ్రామదేవత పాదాలమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు తెన్నేటి సునీల్ శర్మ ఆధ్వర్యంలో దుర్గామహాలక్ష్మీ అమ్మవారికి భక్తులు ముర్రాట్లు సమర్పించారు. ముందుగా ఊరేగింపుగా వచ్చి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన శివశ్రీ నృత్య నికేతన్ గురువు రఘుపాత్రుని శ్రీకాంత్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎస్.ఆర్. డ్యాన్సు స్టూడియో ప్రదర్శనలు అలరించాయి.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం


శ్రీకాకుళం అర్బన్: పాతబస్టాండ్ కూడలిలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్


శ్రీకాకుళం క్రైమ్ : అమరజీవి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి


శ్రీకాకుళం పాతబస్టాండ్: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు


రణస్థలం: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ నేత పిన్నింటి సాయికుమార్


ఎచ్చెర్ల క్యాంపస్: అంబేడ్కర్ వర్సిటీలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు


ఎచ్చెర్ల: లావేరు శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సిబ్బంది


శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీఎం అమరసింహుడు


శ్రీకాకుళం అర్బన్: శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు


శ్రీకాకుళం అర్బన్: పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న స్టార్ వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని వక్తలు పేర్కొన్నారు. పొట్టిశ్రీరాములు 124వ జయంతి సందర్భంగా శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా అమరజీవికి ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీరాములు విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

కార్మికుడికి ఆర్థిక సాయం



నగరంలోని నవభారత్ జంక్షన్ వద్ద వెల్డింగ్ షాప్‌లో పనిచేస్తున్న శ్రీను అనే కార్మికుడు పనిచేస్తుండగా గాయపడటంతో మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకొన్న జైదుర్గ భవాని వెల్డింగ్ యూనియన్ మాజీ అధ్యక్షుడు కింతాడ సంతోష్ ఆధ్వర్యంలో శ్రీనుకు ఆదివారం రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సీపాన శ్రీను, వరదరాజులు, భుజంగరావు, భూషణ్, గోవిందరావు, సర్వేశెట్టి కేశవరావు, దాడి సంతోష్ కుమార్, కరగాన రాజు, నాగరాజు, దాసరి కిరణ్ కుమార్, షాపు ఓనర్ శీను యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం అర్బన్

గాయకుడు గరిమెళ్లకు నివాళి



తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కు ఎచ్చెర్ల శ్రీనివాస మందిరంలో ఆదివారం రాత్రి అన్నమయ్య భక్త ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదిమూలం వెంకటపతిదాసు మాట్లాడుతూ గరిమెళ్ల 1400కు పైగా అన్నమయ్య కీర్తనలు స్వరపరిచి ఆలపించారని గుర్తు చేశారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

అధ్వాన రోడ్డుతో అవస్థలు



ఎచ్చెర్ల మండల పరిధిలో కొత్తపేటకు వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. తోటపాలెం కూడలి నుంచి కొత్తపేట, సెగిడిపేట, ముద్దాడ అంబేడ్కర్‌నగర్ వరకు అధ్వానంగా మారడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

కాలభైరవస్వామికి పూజలు



బలగ నాగావళి తీరంలో బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఆదివారం స్వర్ణాకర్షణ కాల భైరవస్వామికి అభిషేకాలు జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేషపూజలు, హారతులు నిర్వహించి అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


నృత్యం చేస్తున్న కళాకారులు

అరసవల్లి: అరసవల్లి అనివెట్టి మండపంలో ఆదివారం చిన్నారుల కూచిపూడి నృత్యరూపకాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విజయనగరానికి చెందిన వైష్ణవి కళా క్షేత్రం డాన్స్ టీచర్ అయ్యలసోమయాజుల షీలా రమణమూర్తి ఆధ్వర్యంలో 11 మంది చిన్నారులు కూచిపూడి నృత్యాలతో అలరించారు. ఆరికతోట సాయిశ్రీ ప్రకాంక్ష అనే చిన్నారి నేత్రీ ఆదిత్య మంత్రంతో పాటు అచ్యుతం కేశవం..కృష్ణదామోరం... చందన చర్చిత, శ్రీసూర్యనారాయణా...అంటూ చేసిన నృత్యరూపకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గార: మండలంలోని సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో-1 ఎస్.సూర్యనారాయణ తెలిపారు. సీఆర్‌ఎంటీ, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో సోమవారం తెలుగు పరీక్ష జరగనుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం నిషిద్ధమని చెప్పారు. ఎండల నేపథ్యంలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఒంటి పూట తరగతులు ప్రారంభవుతాయని స్పష్టం చేశారు.